

# వెన్నెలదీపాలు

## – డా.యండమూరి వీరేంద్రనాథ్

*(యండమూరి వీరేంద్రనాథ్ గారి రచనాశైలి గురించి పాఠకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చెప్పే అంశం ఏదైనా, మనసుకి హత్తుకునేలా, మనసుల్ని కదిలించేలా అక్షరరూపం ఇవ్వడం యండమూరిగారి ప్రతి రచనలోనూ స్పష్టంగా కన్పిస్తుంది. ఆయన వ్రాసిన 'విజయానికి ఆరో మెట్టు' పుస్తకంలోని చిన్నచిన్న సంఘటనలను ప్రతినెలా మీకందిస్తున్నాము. ప్రతి సంఘటనా ఏదో ఒక నిత్యజీవితసత్యంపై వెలుగులు ప్రసరింపచేస్తుంది.. అన్నీ కలిపి వెన్నెలదీపాల్లా మన మనసుల్ని వెలిగిస్తాయి. వీరేంద్రనాథగారి ప్రత్యేక అనుమతితో ఈ చిన్న కథలు కౌముది పాఠకులకోసం..)*

(గత సంచిక తరువాయి)

**భవబంధం - స్త్రీవాదం**

భవబంధం ఎంత బాధిస్తుందో, పిల్లలు దూరంగా ఎగిరి వెళ్ళిపోయిన వృద్ధులకు తెలుస్తుంది. తల్లిదండ్రుల్ని వదిలి రెసిడెన్షియల్ హాస్టల్స్‌లో వుండే చిన్నారులకు తెలుస్తుంది. పిల్లల్ని వదులుకోలేక భర్త హింసల్ని సహించే భార్యలకి తెలుస్తుంది.

"భగవద్గీతలో 'భవబంధాని'కీ, స్త్రీ వాదానికీ కొంతవరకూ సంబంధం వున్నదేమో అనిపిస్తుంది" అంటుంది ప్రముఖ రచయిత్రి ఊర్మిళా భట్నాగర్. ఒకరోజు ఆమె మార్నింగ్ వాక్‌కి వెళ్తోంటే, జనం గుంపుగా కనపడ్డారట. మధ్యలో ఒకామె భర్తని దాదాపు కొడుతోంది. అతను అన్నాళ్ళూ పెట్టిన హింసకి అది ప్రతీకారం. దాదాపు ప్రతిరాత్రీ ఏదో ఒక నెపం మీద కొట్టేవాడట. ఇది పరాకాష్ఠకు చేరుకుని ఆమె తిరగబడింది. ఆ కాపరం చెయ్యటంకన్నా వదిలేసి పోవటం మంచిదని అరుస్తోంది. అతడి సంపాదన అంతంత మాత్రం. నాలుగిళ్ళల్లో పనిచేసి ఆమె తెచ్చే డబ్బులో కాస్త రాత్రి ముందుకి తీసుకుంటాడు. కాస్త పాకకి అద్దె కట్టాలి. చెప్పిన పనిలో ఏ మాత్రం తేడా వచ్చినా తన్నులు. ఇది భరించలేక వాడిని ఇంట్లోంచి పొమ్మని కొడుతోంది.

ఈ కొత్త కథనానికి జనం చుట్టూ చేరి ఆశ్చర్యపోతున్నారు. ఆ సమయంలో వాడు "నేనెక్కడికి పోతానే? నువ్వేపో" అన్నాడు. ఆమె చప్పున వాడి చెయ్యి పట్టుకుని, అదే గుంపులో వున్న పాక యజమాని దగ్గరికి లాక్కెళ్ళి "ఇదిగో, ఈ ఇంటికి నాకూ సంబంధం లేదు. పాక అద్దె వీడి దగ్గరే తీసుకో, నేను పోతున్నా" అంది. యజమాని కంగారుపడి "వీల్లేదు. వాడికి ఇల్లు చచ్చినా ఇవ్వను. ఉంటే నువ్వే వుండు" అన్నాడు.

"మరి నేను చెపుతున్నదీ అదే కదా" అందామె. మొగుడి పరిస్థితి కుడితిలో పడ్డ ఎలకలా తయారయింది. ఒక్క కోపం వల్ల కలిగిన ఉక్రోషంతో ఆఖరి అస్త్రంగా "పోతానే ...పోతాను. నా కొడుకుని నాకిచ్చెయ్యి" అని అరిచాడు. ఒక్క క్షణం కూడా ఆగకుండా ఆమె పాకలోకి వెళ్ళి, పాలు తాగే వయసున్న బిడ్డని తీసుకొచ్చి వాడి చేతుల్లో పెట్టి 'అంతకన్నా ఏమి కావాలి? తీసుకుపో' అంటూ

తలుపేసుకుంది. ఇది ఊహించని మొగుడు అవాక్కయ్యాడు. చుట్టూ వున్న వాళ్ళని చూసి, సవాలు చేస్తున్నట్టు తీసుకుపోయాడు. కానీ రెండురోజులు తిరిగేసరికల్లా పిల్లాడ్ని తిరిగి తీసుకొచ్చి అప్పచెప్పి 'నేసాకలేను' అన్నాడు. ఇప్పుడు ఆమె పిల్లాడితో కాస్త సుఖంగా వుంటోందిట.

"పిల్లాడి కోసం ముందే పట్టుబట్టి వుంటే దాన్ని సాకుగా తీసుకుని నా జీవితంలో ఆడుకుని వుండేవాడు" అంటుంది ఇప్పుడు.

భవబంధాలు తెంచుకోలేక నరకం అనుభవించే స్త్రీలు తెలుసుకోవలసిన టెక్నిక్ ఇది. పిల్లల్ని సాకుగా పెట్టుకుని, భార్యలు తమనుంచి విడిపోకుండా పురుషులు ఎమోషనల్ గా బ్లాక్ మెయిల్ చేస్తారని ఆ రచయిత్రి అభిప్రాయం. ఈ పనిమనిషి చర్యలో తాను పరిష్కారాన్ని చూసానంటుంది.

భర్తల్తో దారుణంగా హింసించబడే భార్యలు, వారితోనే సంసారాలు కొనసాగించటానికి మూడు కారణాలు వున్నాయనీ, భర్తని ఎంత అసహ్యించుకున్నా కలసి వుండటానికి: ఆ. పిల్లల్ని వదిలి పెట్టలేక పోవటం 2. సమాజంలో హోదా 3. ఆర్థికపరమైన ఇబ్బందుల్ని ఎదుర్కొనే ధైర్యం లేకపోవటం కారణాలనీ, ఈ మూడు భవబంధాల్ని జయించగల్గితే మరింత సుఖంగా బ్రతకొచ్చనీ ఆ రచయిత్రి అంటుంది. రెండు పడవల్లో దేనిలో ప్రయాణం చెయ్యాల్లో నిర్ణయించుకోలేకపోవటమే "సమస్య".

**లవ్ ఎట్ 14**

చిన్న వయసులో ప్రేమలోపడే అమ్మాయిలు సాధారణంగా తమ ఇళ్ళలో సరిగ్గా ప్రేమ దొరకని వారూ, తల్లిదండ్రుల్తో సరి అయిన కమ్యూనికేషన్ లేని వారూ ఆప్యాయంగా వున్న ఇళ్ళలో సంతృప్తిగా వుండే అమ్మాయిలు బయట ప్రేమ వైపు తొందరగా ఆకర్షితులు అవరు. ముఖ్యంగా తండ్రుల్తో సత్సంబంధం వున్నవారికి 'ఇన్‌సెక్యూరిటీ' ఫీలింగ్ తక్కువ వుంటుంది. ఆడపిల్లలు చిన్న వయసులో ప్రేమలో పడటానికి ఉన్న చాలా కారణాల్లో ఈ ఒంటరితనం ఒకటి. 'ప్రేమలో పడకపోతే నీలో ఏదో లోటుంది' అని చెప్పే మీడియా ప్రభావం రెండోది.

డాక్టర్ హరిష్ రెడ్డి, సైకియాట్రిస్ట్ ఒక కేసు గురించి చెప్తూ ఈ విధంగా అన్నారు:

"వరంగల్ పరిసర ప్రాంతాల నుంచి అంకితని నా దగ్గరికి తీసుకొచ్చినప్పుడు పూర్తి డిప్రెషన్‌లో వుందా అమ్మాయి. చదువుకి వెళ్ళనంటోంది. అందరితో మాట్లాడటం మానేసింది. కొంతకాలం ట్రీట్ చేసిన తరువాత విషయం తెలిసింది. పాకాలకి కొద్ది దూరంలో విశాలమయిన సరుగుడు తోటలు, ఏకాంత ప్రదేశాలు వున్నాయట. మొత్తం నలుగురు అమ్మాయిలు, అయిదుగురు అబ్బాయిలు వెళ్ళారు. అందులో ఒక కుర్రవాడు చెరువులో ఈదుతూ మరణించాడు అతడు అంకిత ఫ్రెండ్ అది ఆ అమ్మాయి షాక్‌కి కారణం. భయపడిన ఆడపిల్లలు వెనక్కి వచ్చేసారు. అదృష్టవశాత్తు ఈ విషయం బయటకు రాలేదు. కానీ, అంకిత మాత్రం ఆ షాక్ నుంచి తేరుకోలేకపోయింది."

అయితే, సైకియాట్రిస్ట్ ఈ విషయం చెప్పాక తల్లిదండ్రులు ఇంకా పెద్ద షాక్‌కి లోనయ్యారు. అంకితకి బాయ్ ఫ్రెండ్ వున్నాడనీ, అమ్మాయిలందరూ ఆ విధంగా వెళ్ళారనీ వారు కలలో కూడా ఊహించలేదు. కారణం అంకితకి పధ్నాలుగేళ్ళు.

భారతదేశంలో రోజుకి సగటున వెయ్యి అనధికార అబార్షన్ ఆపరేషన్లు జరుగుతాయి. అందులో సగంపైగా ఇరవై ఏళ్ళ అమ్మాయిలే. ఇది అంతకుముందు పదివేలదాకా వుండేదట. నిరోధ్ బాగా పాపులర్ అయ్యాక ఈ సంఖ్య తగ్గింది. ఏ తల్లిదండ్రులూ కూడా, తమ కుమార్తె ఈ విభాగంలో వుండి ఉంటుందని అనుమానపడరు. ఉన్నా పర్వాలేదు అనుకుంటే అది వేరే సంగతి కానీ, 'అనవసర భవబంధ గర్భాలు' చదువుకి నిశ్చయంగా ఒక అడ్డంకి.

### కల్లుతాగిన కోతి

ఒక బందిపోటు దొంగ బాగా తాగేసి, ఆ అర్ధరాత్రిపూట ఓ పెట్రోల్ బంక్‌లోకి ప్రవేశించాడు. పిస్తోల్ తీసి మేనేజర్‌ని బెదిరిస్తూ, క్యాష్ బాక్స్‌లో వున్న డబ్బంతా ఇమ్మన్నాడు. మేనేజర్ నిరాకరించేసరికి, ఇద్దరి మధ్య పెద్ద గొడవ జరిగింది. "మరీ గొడవచేస్తే ఫోన్ చేసి పోలీసుల్ని పిలుస్తాను" అన్నాడు దొంగ. అలాగే పిల్చాడు కూడా. పోలీసులు వచ్చి ఫోన్ చేసిన దొంగని అరెస్ట్ చేసారు.

ఇంటరాగేషన్‌లో ఎందుకిలా చేసావని అడిగితే "నా పిస్టల్‌లో గుళ్ళు లేవు మరి" అన్నాడు మత్తు దిగిపోయిన తరువాత.

నమ్మశక్యంకాని ఈ సంఘటన అమెరికాలోని మిచిగాన్‌లో దాదాపు మూడు సంవత్సరాల క్రితం జరిగింది. పూర్తిగా ఆల్కహాల్ సేవించినపుడు మనుషులు ఎలా ప్రవర్తిస్తారన్నది కాదు ఈ కథలోని నీతి.

తాము చేసిన తెలివితక్కువ పనులని మనుష్యులు ఎలా సమర్ధించుకుంటారో ఉదాహరణగా చెప్పడమేనని ప్రసిద్ధ మానసిక శాస్త్రవేత్త రాబర్ట్‌స్కలర్ ఒక చోట రాస్తాడు.

### రాక్షసి తల్లి

చిన్నప్పుడు పిల్లల్లో స్వార్ధం మితిమీరితే, శాడిజం పెరుగుతుంది. ఫేస్ ఆఫ్ సినిమాలో నటించిన ఆస్కార్ బహుమతి గ్రహీత నికొలస్‌కేజ్, చిన్నప్పుడు స్కూల్ ఫంక్షన్ లో, ఐస్‌క్రీమ్‌లో తుమ్మెదల్ని కలిపి పిల్లలకి వడ్డించి స్కూల్ నుంచి తొలగించబడ్డాడు. చిన్న పిల్లల్లో అటువంటి విపరీత ధోరణులను తల్లిదండ్రులు చిన్నప్పుడే తొలగించాలి.

'తల్లి పిల్లల్ని ఎలా పెంచాలి' అన్న విషయంపై కార్లా అనే ఒక అమ్మాయి తన తల్లి గురించి ఈ విధంగా వ్రాసింది.

"నా తల్లిలాటి తల్లి ఎవరికీ వుండివుండదు. మిగతా అందరు పిల్లలు ప్రొద్దున్నే హాయిగా బన్ బట్టర్లూ, కోడిగుడ్డు ఆమ్లెట్లూ తింటూ వుంటే, మాకు మాత్రం ఆరోగ్యం పేరిట పాలల్లో నానపెట్టిన అటుకులూ, పచ్చి కూరగాయ ముక్కలూ పెట్టేది. లంచ్‌లో పెప్సీలూ, కోకోకోలాలూ తాగనిచ్చేది కాదు. మేము ఏ టైమ్‌లో ఎక్కడున్నామో, ఎప్పటికప్పుడు తెలుసుకునేది. అరగంటలో వస్తామంటే అరగంటలో రావల్సిందే లేకపోతే కారణాలు ఆరాతీసేది. పదిమంది పని వాళ్ళున్నా చైల్డ్ లేబర్ ఆక్ట్ నియమాల్ని ఉల్లంఘించే పనులన్నీ మీద భక్తి, మంచి చదువు, నిజాయితీతో కూడిన జీవితం.. ఇవే అలవడినాయి.

మా పిల్లల్ని కూడా మేము మా అమ్మ పెంచినట్టే పెంచాలని మా ప్రయత్నం. ప్రస్తుత ప్రపంచానికి అదే లోటు. అమ్మలాంటి అమ్మలు చాలా తక్కువైపోతున్నారు."

ఈ ఉత్తరం వ్రాసిన కార్లా ప్రస్తుతం ఫిలిప్పైన్స్ పార్లమెంట్ మెంబరు. ఆమె తల్లి పేరు అక్వినో, ఆమె అమెరికాలో చదువుకున్న ఫిలిప్పైన్స్ దేశస్తురాలు. ఆ దేశపు ప్రెసిడెంట్. ఎంతో ప్రతిభావంతురాలు. ఆమెకు వివిధ సబ్జెక్టుల్లో అయిదు డాక్టరేట్‌లు ఉన్నాయి. 'లా' డిగ్రీ కూడా ఉంది. వివాహం జరిగాక, కుటుంబాన్ని చూసుకోవటంలో నిమగ్నమైంది. పాలిటిక్స్‌లో ఆమె భర్త చాలా ఉన్నత స్థానంలో ఉండేవాడు. ఆమె భర్తని రాజకీయ కుట్రలో ప్రత్యర్ధులు చంపేసాక పార్టీ కార్యకలాపాలు ఆమె చూసుకోవలసి వచ్చింది. దేశంలో అస్తవ్యస్తంగా వున్న పరిస్థితుల్ని ఒక కొలిక్కి తీసుకు రావటంలో సఫలీకృతురాలైంది. ఆ పైన ఫిలిప్పైన్ దేశానికి ప్రెసిడెంట్ కూడా అయింది. ఆ దేశ ప్రజలకి ఆమె ఆరాధ్యదైవం. ఆమె పిల్లలకి కూడా.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*